
# మిస్ కె.కె

## తోటకూర ఆశాలత




మిస్ కె. కె. అంటే ఎవరో విజయవాడలోని మారిస్‌స్టెల్లా కాలేజీ 1971-72 ఫైనల్ ఇయర్ డిగ్రీ స్టూడెంట్సుకి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. కె. కె. అసలుపేరు కృష్ణకుమారి. కాని, సైన్సు స్టూడెంట్ కావడంతో ప్రాక్టికల్స్ మార్కుల్ని దృష్టిలో పెట్టుకొని సైన్సు క్లాసుల్లో మాత్రం మొదటి బెంచీలో కూర్చుని లెక్చరర్ వేసే పాతజోకులకు పగలబడి నవ్వుతూ – పండుగలొస్తే చాలు విధిగా ప్రతి లెక్చరర్ ఇంటికి వెళ్ళి గ్రీటింగ్‌కార్డు ఇచ్చేది ఆమె పడే పాట్లని దృష్టిలో పెట్టుకుని 'కాకా' అని ఒక ముద్దుపేరు పెట్టాం ఆ విధంగా 'కె కె' అన్న ముద్దుపేరు గల కృష్ణకుమారి 'కాకా, విరకాకా, పరమవీర కాకా' అన్న మూడు బిరుదుల్నీ మూడు సంవత్సరాల్లోనూ సంపాదించేసి ఆపైన సంపాదించడానికి మరో బిరుదులేక మూడేళ్ళడిగ్రీ కోర్సుతో చదువు ముగించి, మూడుముళ్ళు వేయించుకొని ఇల్లాలిగా సెటిల్ అయింది.

అదదిగో ఆ 'కె. కె' ఆమధ్య ఒకరోజున హఠాత్తుగా విజయవాడ ఆర్. టి. సి. బస్ స్టాండులో సాక్షాత్కరించింది. ఎర్రత్రికోణం పుణ్యమా అని దానివెంట గంపెడు పిల్లలులేరు గాని రెండు [illegible]గాడు గంపలు మాత్రంవున్నాయి 'ఏమిటే ఇక్కడుంటున్నావు? మీవారేం చేస్తున్నారు? ఎంతమంది పిల్లలు?' అంటూ ఏడేళ్ళ తర్వాత కనిపించిన నేస్తాన్ని ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరిచేశాను. వాళ్ళాయన ఏలేశ్వరంలో లెక్చరర్ అని వివరాలుచెప్పి తమ ఇంటికి తప్పకుండా రావాలంటూ చేతిలో చెయ్యి వేయించుకుంది. అంతలో నేను వెళ్ళవలసిన బస్ రావడంతో సెలవుతీసుకున్నాను. ఆతర్వాత మా కె. కె. ని దాదాపుగా మర్చిపోయాననే చెప్పవచ్చు. కాని ఈమధ్య ఉద్యోగరీత్యా ఏలేశ్వరం వెళ్ళవలసి వచ్చింది. ఉదయం వెళ్ళినదాన్ని సాయంత్రం తిరిగిరావాలి. ఏలేశ్వరంవెళ్ళికూడా కె.కె.ని చూడకుండా తిరిగిరావడం ఎలా? కాని టైమ్ సరిపోదు. చివరకు ఎలాగయితేనేం మధ్యాహ్నం లంచ్‌టైమ్‌లో కె.కె.ని చూడటానికి వెళ్ళాను.

సర్వసాధారణంగా గుడిలోకి అడుగుపెట్టగానే చిరుగంటల సవ్వడులు స్వాగతంపలుకుతాయి. అదే ఇల్లయితే డోర్‌కర్టెన్ స్వాగతం పలుకుతుంది. కాని మా కె. కె. ఇంట వీటికి అతీతంగా దండగాకట్టిన మైక్రో టెస్టుట్యూబులు స్వాగతం పలికాయి. ఒక్కొక్క టెస్టుట్యూబుని ఒక్కో కలరు వాటర్‌తో నింపడంతో చూడముచ్చటగా వున్నాయి. కె. కె. తెలివితేటల్ని, అభిరుచిని మెచ్చుకుంటూ డ్రాయింగురూములోకి అడుగుపెట్టాను సోఫాలో కూర్చుని వారపత్రిక తిరగేస్తున్నదల్లా నన్ను చూసి ఎగిరి గంతేసి కౌగిలించుకున్నంత పనిచేసింది పిచ్చాపాటీ పూర్తయ్యాక, "లేవే, భోజనం చేద్దువుగాని" అన్నది.

"భోజనం తర్వాత. ముందుమంచినీళ్ళివ్వు"

అనాను.

"నామతి మంద, మర్చేపోయాను" అంటూ కె.కె. లేచి వెళ్ళడంతో, నాదృష్టి ఎదురు టేబుల్ పైనున్న ఫవం వేజ్ పై నిలిచిం. కోనికల్ ఫ్లాస్కులో ప్లాస్టిక్ పూలు డెకరేట్ చేసింది. ఫ్లాస్కులోని నీళ్ళలో రెడ్ లిట్మస్ పేపరు వేసినట్లుంది-చూడటానికి ముచ్చటగా వుంది. మరోమారు మా 'కె.కె.' అభిరుచిని మెచ్చుకున్నాను. అంతలో అది అందించిన మంచినీళ్ళు త్రాగి ఖాళీగ్లాసు 'టీపాయ్'మీద పెడ్తూ చేతిలోని వస్తువుని చూసి విస్తుపోయాను. కారణం నేను మంచినీళ్ళు త్రాగింది గ్లాసులో కాదు బీకర్ లో! "రెండ్రోజులుంటావు కదూ" అన్న ప్రశ్నతో ఈ లోకంలోకొచ్చాను. క్లాస్‌మేట్సు ఎవరెవరు. ఏంచేస్తుందీ అడిగింది. చెప్పాను. చివరకు భోజనంచేయడానికి డైనింగ్ రూములోకి వెళ్లాం. వాటరున్న రౌండ్ బాటమ్ ఫ్లాస్కు. నాలుగు బీకర్లు వున్నాయి. 'ఓహో వాటర్ జగ్‌కి, గ్లాసులికి వచ్చినతిప్పలు కాబో ఇవి' అనుకుంటూ టేబుల్ ముందు కూర్చున్నాను. అంతలో వాచ్ గ్లాసొకటి దబ్బకా పళ్ళెంతో వచ్చి నాముందు వాలింది. వాచ్ గ్లాసుని చూడగానే 'ఎసిటేట్ టెస్టు' గుర్తొచ్చింది డిగ్రీ చదివే రోజులలో మాకిచ్చిన సాల్ట్ ఎసిటేట్' అయినదీ కానిదీ టెస్టు చేయడానికి ఈ వాచ్‌గ్లాసుని ఉపయోగించే వాళ్ళం. ఇచ్చినసాల్ట్, పొటాషియమ్ బైసల్ఫేట్, వాటర్ కలిపి గ్లాసు రాడ్‌తో రబ్‌చేసి స్మెల్ చూసి ఆ సాల్ట్ 'ఎసిటేట్' అయిందీ కానిదీ చెప్పాలి. 'మందమతి' అని మేము ముద్దుగా పిలుచుకునే 'ఇందుమతి' అని క్లాస్‌మేట్ వుండేది. ఎప్పుడూ నిద్రమొహంతో 'ఎందుకొచ్చిన గొడవ ఇది' అన్నట్టుగా ప్రవర్తించే ఆ మందమతిని ఏడిపించాలన్న వెధవ ఆలోచన ఒకటి వచ్చింది మా కె.కె.కి. ఆ రోజున కెమిస్ట్రీ లాబ్‌లో వున్నాం. వెంటనే 'ఎసిటేట్' టెస్టు వాటర్‌కి బదులు కాన్‌సెన్ట్రేటెడ్ నైట్రిక్ యాసిడ్ వేసింది. గ్లాస్‌రాడ్‌తో రబ్‌చేసి "ఇందూ, ఇందూ కొంచెం ఈ స్మెల్ చూసి ఎసిటేట్ అయింది కానిదీ చెప్పవే....నను జలుబు చేసి ఏస్మెల్ అయిందీ తెలియడంలేదు" అంటూ వాచ్‌గ్లాసు మందమతి ముక్కు దగ్గర పెట్టింది

నైట్రిక్ యాసిడ్ ఫ్యూమ్స్‌ని చూసిన బ్రతుకు లేదు, గుండెలనిండా గాలిపీల్చింది అంతే ఆ ఫ్యూమ్స్‌తో ఉక్కిరి బిక్కిరయింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి పదేలున నేలపై కూలబడి ఒళ్ళో తలదాచుకుంది. ప్రక్కనున్న మేము తింగారుగా చేతిలో బ్యూరెట్లు, ప్యాబ్స్‌ని స్టాండులో పెట్టి దాని దగ్గరకు చేరడం గమనించి, 'ఏమయింది' అంటూ వచ్చింది మా కెమిస్ట్రీ లెక్చరర్. అసలు విషయం ఎక్కడ బయటపడుతుందోనని బితుక్కు బితుక్కుమంటూ ఏడుపు మొహంతో చూస్తుండిపోయింది మా కె కె అసలువిషయం బయటపడితే ఫైన్ కట్టమంటుందనిగాదు మా కె. కె. బాధ; గుడ్ ఇంప్రెషన్ పోతుందేమోనని. దాని పరిస్థితి గమనించి. "ఏం లేదు మేడమ్, రెండ్రోజుల్నుంచి హెల్త్ బాగుండటం లేదు. అందునా ఉదయంనుంచి నిల్చున్నది కదా, కళ్ళు తిరిగినట్టున్నాయి" అన్నది

మేడమ్ ప్రక్కకు వెళ్ళగానే దెబ్బలాటకు దిగింది. అలనాటి తియ్యని స్మృతుల్ని చెదరగొడ్తూ పెట్రీ డిష్ ఒకటి వచ్చి నా ముందు వాలింది. ఒక రోజున మిక్చర్ సెపరేషన్‌కి ఉపయోగించిన ఆ పెట్రీడిష్ ఈ రోజున వంకాయ కూర గిన్నెగా నా ముందున్నది. ఇలా ఇంకా ఎన్ని అపరేటస్‌లు ఏ ఏ రూపాలలో సాక్షాత్కరిస్తాయోనని కుతూహలంగా చూస్తుండిపోయాను. క్రుసిబుల్ నేతి గిన్నెగా, ఐరన్ టంగ్సు పట్లారుగా నా ముందుకు రావడంతో 'ఏమే, మనం డైనింగు టేబుల్ దగ్గర కూర్చున్నామా? లేక కెమిస్ట్రీ లాబ్‌లో కప్‌బోర్డు దగ్గర కూర్చున్నామా?' అనడిగాను

"మా వారు ఎకనమిక్సు లెక్చరర్ కావలసింది. పొరపాటున కెమిస్ట్రీ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ అయ్యారు" నవ్వుతూ సమాధానమిచ్చింది కె కె.

ఇహ దాని సమాధానంతో మరో ప్రశ్న అడిగే అవకాశం నాకు లేకపోయింది. మౌనంగా భోజనం పూర్తయిందనిపించి వాష్ బేసిన్ దగ్గరకు నడిచాను. గోడ ప్రక్కనున్న వస్తువుని చూసి మరొక్కమారు విస్తుపోయాను. కారణం నా దృష్టిని ఆకర్షించిన ఆ వస్తువు 'మోర్టార్' కెమికల్ గ్రాన్యూల్స్‌ని పౌడరు చేసి మిక్చరు తయారు చేయడానికి 'మోర్టార్' ఉపయోగించే వాళ్ళం. ఇప్పుడా మోర్టార్‌ని మషాలా నూరడానికి ఉపయోగిస్తోంది మా కె. కె అప్రయత్నంగా నా పెదవులపై దరహాస రేఖలు తొంగిచూశాయి.

నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకొని హేంగర్ మీద ఆరబెడ్తూ అప్రయత్నంగా దాని వైపు చూశాను-దాని మీద 'ప్రెజెంటెడ్ బై' అని ఎవరి పేరో వుంది. నేప్‌కిన్ ప్రెజెంటేషన్ ఏమిటి? అనుకొన్నాను నేప్‌కిన్ పైనే కాదు, డోర్ కర్టెను మీద కూడా 'ప్రెజెంటెడ్ బై' అని వ్రాసి వుండే కుతూహలం చంపుకోలేక "ఏమిటే నేప్‌కిన్ దగ్గర్నుంచి అన్నీ ప్రెజెంటేషన్లేనా" అనడిగాను

"రికార్డు సర్టిఫై చేయించుకోవడానికి సంవత్సరాంతంలో స్టూడెంట్సు వస్తారు కదే! ఎవరు ఏది ప్రెజెంట్ చేసిందీ ఎలా తెలుస్తుంది-పైగా అరవయి మంది స్టూడెంట్సు వుంటారాయె" అన్నది కె కె. దీర్ఘం తీస్తూ.

ఇప్పటికీ కెమిస్ట్రీ లెక్చరర్ ఎవరయినా తారసపడితే చాలు, మా కె. కె. గుర్తొస్తుంది. పెదవులపై చిరునగవు చోటు చేసుకుంటుంది.

*

తగలెయ్!

-మధ్యాహ్నపు లీలానంద్

